

భయపెడుతున్న రోడ్లు

తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

భయాందోళన చెందుతున్న వాహనచోదకులు

మలుపుల మాటున ముప్పు!

ప్రమాదాలకు నిలయమైన గంగవరం వెళ్లే వెంకన్నపాలెం జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డు లేని దృశ్యం



చిన నడుపూరు నుంచి వుడాకాలనీ వెళ్లే ప్రధాన కూడలిలో కానరాని హెచ్చరిక బోర్డు





వెంపళ్లనగర్ ప్రధాన కూడలిలో ప్రమాదకర మలుపులు



సమతానగర్ సాయిబాబా ఆలయం వద్ద ప్రమాదకరంగా మలుపు

పెదగంట్యాడ: మండలంలోని పలు రోడ్లలోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ 77 వార్డు పరిధిలోని మదీనాబాగ్ నుంచి 64వ వార్డు గంగవరం వెళ్లే రోడ్డులో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ రహదారుల్లో ప్రయాణమంటే వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. నెమ్మదిగా వెళ్లినా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఢీకొంటున్నారు. మరోవైపు కుర్రకారు స్పోర్ట్స్ బైక్‌లతో రయ్ రయ్ మంటూ దూసుకొచ్చి భయపెడుతున్నారు.

గందరగోళం

ప్రధాన కూడళ్ల వద్దకు వెళ్లే వాహనదారులకు ఎవరు ఎటు నుంచి వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకుంటోంది. దీంతో ఒకరినొకరు ఢీ కొనడం, గాయాలపాలవడం మామూలుగా మారిపోయింది. ప్రగతి మైదానం నుంచి మదీనాబాగ్ వెళ్లే ప్రధాన రహదారిలో మొదటి మలుపు వద్ద ఇటీవల ఓ ప్రమాదం జరిగింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు వేగాన్ని అదుపు చేయలేక ఒకరినొకరు ఢీకొన్నారు. గాయాలపాలయ్యారు. చిన నడుపూరు నుంచి వుడా కాలనీ వెళ్లే మలుపు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వుడా డబుల్ రోడ్డు మధ్యలో విభాగిని ఏర్పాటు చేయడంతో పాటు దాని చుట్టూ ఎత్తుగా గోడ కట్టేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అంతేకాకుండా ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో అక్కడ మలుపు వద్ద రోజులో రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువైపు సిద్ధేశ్వరం.. అటువైపు పాత గాజువాక.. మరోవైపు కర్ణవానిపాలెం, ఇంకోవైపు వుడా కాలనీలోకి వెళ్లే నాలుగు రోడ్ల కూడలి.. సమతానగర్ జంక్షన్ వద్ద వాహనచోదకులు తికమక పడుతున్నారు. వాహనచోదకులు ఎటునుంచి ఎటువెళ్తారో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దల్లివానిపాలెం సచివాలయం జంక్షన్ వద్ద నుంచి ఇటు సిద్ధేశ్వరం.. అటు సమతానగర్, అలాగే సీతానగరం వెళ్లేందుకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఎటునుంచి ఏ వాహనం దూసుకొస్తుందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన జంక్షన్ కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే వెంకన్నపాలెం జంక్షన్ నుంచి గంవరం వెళ్లే ప్రధాన రహదారిలోని మలుపులు కూడా ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్డులోని మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో భారీ వాహనాలు దూసుకొస్తున్నాయి. ఆ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు భారీ వాహనాలను తప్పించలేక ప్రమాదాలకు లోనవుతున్నారు.

స్టాపర్లు మాయం

గతంలో ఇక్కడ మలుపులు వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. అయితే పలు పరిశ్రమల యజమానుల ఒత్తిళ్లకు తలొగ్గి వాటిని తీసి పక్కన పడేశారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ప్రమాదకరమైన మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టాపర్లు ఏర్పాటు చేస్తాం

మండలంలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు వద్ద స్టాపర్స్ వెంటనే ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటాం.వాహనదారులు కూడా మలుపుల్లో జాగ్రత్తగా వెళ్లాలి.

– గణపతి, ట్రాఫిక్ ఎస్ఐ, న్యూపోర్టు పోలీసు స్టేషన్

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 75 మంది ఎంపిక

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 75 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జయభేరి, అపోలో ఫార్మసీ, కియా మోటార్స్, డీఎస్ఎస్ తదితర 15 కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 300 మంది అభ్యర్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.వి.కామేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 44 ఏళ్ల లోపు, ఇంటర్ పాసైన వారు అర్హులన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490391324 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధే ధ్యేయంగా...



పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, విద్యా మరియు పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం అందించుకొనే లక్ష్యంతో విజ్ఞాన్ మహిళా కళాశాల... హైటెక్ యాజమాన్యాలు పరస్పర ఒప్పందం చేసుకున్నాయి. కాపుజగ్గరాజుపేటలోని కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి, హైటెక్ సంస్థ ఎండీ బి.వల్లభరావు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో ఈసీఈ, ఈఈఈ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లు అదృశ్యం

కూర్మన్నపాలెం: తల్లిదండ్రులు మందలించడంతో అక్కాచెల్లెళ్లు అదృశ్యమయ్యారు. పోలీసులు అందించిన వివరాలు.. దువ్వాడకు చెందిన షేక్ నాగూరు తన ఇద్దరు కూతుళ్లు నిత్యం మొబైళ్లు చూస్తున్నారని మందలించాడు. దీంతో కుమార్తెలు షేక్ షర్మిళ, షేక్ నబీదాబేగమ్ ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఐదు రోజులపాటు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం దక్కలేదు. చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.మల్లేశ్వరరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందిన అభాగ్యులు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది రైల్వే పోలీసుల సహకారంతో బుధవారం ఎనిమిది మంది నిరాశ్రయులను జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్ హోంలకు తరలించారు. దయగాన్, ఒడిశాకు చెందిన ప్రీతీ రాజేశ్వరి, బీహార్‌కు చెందిన పురుషులు సుఖన్, బొబ్బిలికి చెందిన తాబ్బూరి సత్యనారాయణ, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన లాకొజీ నారాయణ స్వామి, గుర్లకు చెందిన పెనుబర్తి నాయుడు, కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన రాజు, దువ్వాడకు చెందిన నిర్మల్ సింగ్, బీహార్, బంకాకు చెందిన సంతోష్ కుమార్ శర్మ తదితరులను షెల్టర్‌కు తరలించారు. వీరిలో ఒక్కరు మినహా మిగతా వాళ్ల మానసిక స్థితి సరిగా లేక రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పెట్టింది తింటూ బతుకుతున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీరందరినీ ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయించి షెల్టర్లకు తరలించినట్లు వాసు తెలిపారు. వారి వివరాలు తెలిస్తే తెలపాలని కోరారు.

విమల విద్యాలయాన్ని పునఃప్రారంభించాలి



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులతో కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)ను వెంటనే పునః ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభించి వారం రోజులు అయినా పాఠశాలను తెరవలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం పెద్ద సంఖ్యలో పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాల తెరవక పోతే పరిస్థితి ఏంటంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ బి. గంగారావు అక్కడకు చేరుకుని నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తెరవక పోతే అందులో చదువుతున్న 1700 మంది విద్యార్థుల పరిస్థితి ఏంటన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు తక్షణం జోక్యం చేసుకుని పాఠశాల ప్రారంభించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలన్నారు.

రథాలమ్మ ఉత్సవానికి విస్తృత ఏర్పాట్లు



సిరిమానును పరిశీలిస్తున్న నిర్వాహకులు



రథాన్ని సిద్ధం చేసిన నిర్వహకులు

కూర్మన్నపాలెం: వడ్లపూడి కణితికాలనీలో ఈ నెల 24న జరగనున్న రథాలమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. ఎనిమిదేళ్లకు ఒక సారి నిర్వహించే పండగ కావడంతో వార్డులోని కాలనీలన్నీ ముస్తాబు అవుతున్నాయి. ప్రధానంగా పారిశ్రామిక వాడలో ఎక్కడా లేనివిధంగా ఉత్సవం రోజు రోజు సిరిమాను పురవీధుల్లో తిరగనుంది. అందుకు సిరిమానుతో పాటు రథాన్ని తయారు చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్వాహకులు దగ్గరుండి మరీ సిమాను చెట్టు చెక్కించడం, దాన్ని పురవీధుల్లో తిప్పేందుకు రథాన్ని సిద్ధం చేస్తున్నారు. అలాగే వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి సరంజామా సిద్ధం చేస్తున్నారు. అలాగే బంధు, మిత్రులకు ఆహ్వానాలు పంపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల్లో నూతనోత్తేజం



కేకే రాజుకుపుష్ప గుచ్ఛం అందజేస్తున్న ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు జీలకర్ర నాగేంద్ర



68వ వార్డు అధ్యక్షుడు నూకరాజును అభినందిస్తున్న వార్డు నాయకులు

గాజువాక: వైఎస్సార్ సీపీలో నూతన నియామకాలు ఆ పార్టీ నాయకుల్లో నూతనోత్తేజం కనిపిస్తోంది. పదవులు పొందిన నాయకులు తమ నేతలను కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరోపక్క వార్డు అధ్యక్షులుగా, అనుబంధ సంఘాల్లో వివిధ పదవులు పొందినవారిని ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న రైల్వే ఉద్యోగులు, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: యోగా సాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందని రాజయోగి బీకే దిల్‌రాజు భాయీజీ అన్నారు. ఈనెల 21న చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ బ్రహ్మకుమారీస్ సంస్థ ఈ ప్రాంతంలో విస్తృత ప్రచారం చేపడుతోంది. దానిలో భాగంగా బుధవారం దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగులకు యోగాపై ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి , అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఏఐసీయూ వైజాగ్ సర్వసభ్య సమావేశం

దాబాగార్డెన్స్: ఆలిండియా క్యాథలిక్ యూనియన్ విశాఖపట్నం సర్వసభ్య సమావేశం బుధవారం మహారాణిపేట ఆర్‌సీఎం పాస్టరల్ సెంటర్ హాల్లో నిర్వహించారు. విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల పాల్గొని పలు సూచనలు చేశారు. సంఘం విశాఖ గౌరవ అధ్యక్షుడు గోన స్వామినాథం మాట్లాడుతూ ఏఐసీయూ విధి విధానాలు, కార్యకలాపాలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణ తదితర విషయాలు వివరించారు. సంఘం విశాఖ రీజియన్ అధ్యక్షుడు, జాతీయ సహాయ కార్యదర్శి బూర వేలంగిణి రవీంద్ర శేషుబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీయూ చేపట్టిన కార్యక్రమాలు, సంఘం పురోగతిని వివరించారు. ఏఐసీయూ సభ్యుడు చిట్టిబాబును ఆర్చి బిషప్ ఉడుముల బాల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ ఎం.ప్రతాప్, విశాఖ అర్బన్ డీన్ ఫాదర్ ఎస్.ప్రతాప్, ఏఐసీయూ కార్యదర్శి బేతా జోసెఫ్, కోశాధికారి పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగా నిత్యకృత్యం కావాలి



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: యోగా సాధన రోజువారి కృత్యాల్లో ఒక భాగం కావాలని జీవీఎంసీ 77వ వార్డు పరిధి చాపలపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 వరకూ యోగా శిక్షణ ఉంటుందని, తర్వాత నుంచి ఇళ్ల వద్ద క్రమం తప్పకుండా యోగా చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బుడగట్ల హేమంత్‌కుమార్, సోంబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: అగనంపూడి, దువ్వాడ, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీల్లో క్రీడాకారుల కోసం క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డికి అగనంపూడి నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం, రాజీవ్ గృహ కల్ప సముదాయాల నుంచి మంగళపాలెం, దువ్వాడ రైల్వేస్టేషన్, రాజీవ్ నగర్ మీదుగా గాజువాక వరకు సిటీ బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. బి.సత్యనారాయణ, రమేష్ తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

ఆర్టీసీ మనుగడే ధ్యేయంగా పనిచేయాలి

మంత్రి రామ్‌ప్రసాదరెడ్డి



స్టీల్ సిటి డిపోలో సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాదరెడ్డి

ఉక్కునగరం: ఆర్టీసీ మనుగడే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాదరెడ్డి అన్నారు. కూర్మన్నపాలెంలోని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్టీసీ ఉంటేనే సిబ్బందికి ఉపాధి ఉంటుందన్నారు. ప్రయాణికులతో మమేకమై సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు డిపో ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం నుంచి రుషికొండ మీదుగా ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు నూతన సర్వీసు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ ఈడీ కె.ఎస్. బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, స్టీల్ సిటీ డిపో మేనేజర్ చటర్జీ, ఏడీఎం పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు అలంకారప్రాయం!



అగనంపూడి ఆస్పత్రి సమీపంలోని చలివేంద్రంలో ఏర్పాటు చేసిన దుకాణాలు



చలివేంద్రంలో ఖాళీ కుండలు ఇలా..

అగనంపూడి: పేరుకే చలివేంద్రాలు... అక్కడ సేవకులు ఉండరు. మంచినీరు కూడా ఉండదు. ఖాళీ కుండలు మాత్రమే దర్శనమిస్తాయి. ఇదీ మహా విశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రాల తీరు. ఆరంభం నుంచి మహా చలివేంద్రాలు తూతూమంత్రంగానే నిర్వహిస్తున్నారు. షెల్టర్ ఏర్పాటు చేసి రెండు కుండలు, రెండు గ్లాసులు తప్పా వాటిలో నీరు కనపడడం లేదు. నీటిని అందించే సేవకులు కానరావడం లేదు. మండువేసవిలో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో జీవీఎంసీ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అగనంపూడి బస్టాప్ సమీపంలో చలివేంద్రం కోసం గ్రీన్ క్లాత్‌తో ఒక కుటీరం ఏర్పాటు చేశారు. పక్కనే మరో కమ్మలపాక నిర్మించి రెండు ఖాళీ కుండలు బోర్లావేసి ఉంచారు. రెండు షెలర్లు కూడా వారపు సంత వ్యాపార స్టాల్స్ ఏర్పాటు చేసుకోడానికి ఉపయోగపడ్డాయి తప్పా తాగునీటి అవసరాలు తీర్చలేదు.



ఫోకస్

తాగునీరు వృథా

జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ ప్రధాన రహదారిలో పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. అసలే అంతంత మాత్రంగానే వస్తున్న తాగునీరు.. పైపు లైన్ పగిలిపోవడంతో అసలు రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా పరిస్థితి ఇలానే ఉందని.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – పెదగంట్యాడ

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. పరవాడ ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్–2పై వర్చువల్ విధానంలో పని ప్రదేశంలో అవగాహన సదస్సులో సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చట్టంలో పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.